క్లుప్తంగా

వలంటీర్ల సదస్సును జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): విజయవాడలోని బసవ పున్నయ్య భవన్‌లో మంగళవారం నిర్వహించనున్న గ్రామ/వార్డు సచివాలయ వలంటీర్ల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు ఆదివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ ప్రకారం వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.10 వేల వేతనం ఇవ్వాలని, రాజీనామా చేసిన వలంటీర్లందరినీ తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని కోరుతూ నిర్వహిస్తున్న సదస్సుకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): ఏపీ తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ కర్నూలు, నంద్యాల జిల్లాల నూతన కార్యవర్గం ఎన్నికైంది. యూనియన్ సర్వసభ్య సమావేశం ఆదివారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఓల్డ్ క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎ.మాధవరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.నాగలక్ష్మి, జనరల్ సెక్రటరీగా సి.బంగారి, కోశాధికారి శ్రీధర్‌రెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా బి.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా కె.మద్దిలేటి, కోశాధికారి ఎ.రామసుబ్బయ్య తదితరులు ఎన్నికయ్యారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మద్దయ్య, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎల్.రాఘవేంద్రగౌడ్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అశోక్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు వై.నరసింహులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

కర్నూలు(సెంట్రల్):పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతా ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో పోస్టు గ్రాడ్యుయేట్, ట్రైయినీ వైద్యురాలు మౌమితా దేబనాథ్ హత్యాచార ఘటన బాధాకరమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కె.బాబురావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.దేశంలో రోజురోజుకు మహిళలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోతున్నా కేంద్ర, స్థానిక ప్రభుత్వాలు నివారించడంలో వైఫల్యం చెందాయని ఆరోపించారు. 78 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో మహిళల రక్షణ కోసం దిశ, నిర్భయ, పోక్సో వంటి పలు చట్టాలు అమల్లో ఉన్నా మహిళలకు రక్షణ లేకుండా పోతోందని వాపోయారు. దేశంలో డాక్టర్లు, జూనియర్ డాక్టర్లపై కూడా అత్యాచారాలు చేస్తే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లి జన్మనిస్తే.. వైద్యులు పునర్జన్మనిస్తాదని వైద్యురాలిపైనే హత్యాచారం జరగడం బాధాకరమని వాపోయారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులు సమర్పించవచ్చని సూచించారు. అలాగే అన్ని మండల, డివిజనల్, మునిసిపల్ కార్యాలయాల్లో కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు ఆయన వెల్లడించారు.

బాధ్యతల స్వీకరణ



సీఐ రామయ్య నాయుడు

కర్నూలు: కర్నూలు ఒకటవ పట్టణ సీఐగా రామయ్యనాయుడు బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఇక్కడున్న పవన్‌కుమార్‌ను కర్నూలు ఫ్యాక్షన్ జోన్‌కు బదిలీ చేసి రామయ్యనాయుడును వన్‌టౌన్‌కు నియమించడంతో ఆయన ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణానికి చెందిన ఈయన 1996లో ఎస్‌ఐ హోదాలో పోలీస్ శాఖలో చేరారు. కర్నూలు, కడప, అనంతపు రం జిల్లాల్లో పనిచేశారు. 2010లో సీఐగా పదోన్నతి పొంది జిల్లాలోని వివిధ స్టేషన్లలో విధు లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేకాట, మట్కా, ఇతర అసాంఘిక కార్యకలాపాలను సహించేది లేదని హెచ్చరించారు.బీట్ సిస్టమ్‌ను పునరుద్ధరించి శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్య లు చేపడతామన్నారు. సమస్యలపై స్టేషన్‌ను ఆశ్రయించే ఫిర్యాదుదారుల పట్ల సభ్యతతో వ్యవహరించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు(టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు నగరపాలక కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలకకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు జిరాక్స్ సెల్‌ఫోన్ నంబర్‌తో వచ్చి నేరుగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

అధికారుల మాయాజాలం

- సమస్య పరిష్కరించకుండానే పూర్తి చేసినట్లు ఫిర్యాదుదారుడికి మెసేజ్
- మంత్రి, కలెక్టర్‌ను తప్పుదోవ పట్టించిన మున్సిపల్ అధికారులు
- విషయం తెలుసుకుని ట్విట్టర్‌లో క్షమాపణలు చెప్పిన మంత్రి
- మంత్రి ఆదేశాలతో ఎట్టకేలకు సమస్య పరిష్కారానికి చర్యలు
- మున్సిపల్ అధికారుల తీరిది

ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో స్థానికంగా నెలకొన్న మురుగు సమస్యపై ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు. సమస్యను నమోదు చేసుకుని త్వరలోనే పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. తర్వాత సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపట్టకపోయినా ఫిర్యాదుదారుడికి మాత్రం మీరు చెప్పిన సమస్యను పరిష్కరించేశామంటూ మేసేజ్ రావడంతో అవాక్కయ్యారు.



బాధితుడికి ఎక్స్ మాధ్యమంలో క్షమాపణలు చెబుతూ పోస్ట్ చేసిన మంత్రి నారా లోకేష్





మురుగుతో నిండిన స్కంద గేటెడ్ కమ్యూనిటీ కాలనీ, గల్వర్‌తో మురుగు నీరు తొలగిస్తున్న కార్మికులు,పొక్లెయిన్‌తో కాలవ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): రెండు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్నట్లు ప్రకటించింది. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్, నగరపాలక సంస్థలో ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. ప్రజల నుంచి వినతులు, అభ్యర్థనలను స్వీకరిస్తుంది. వినతి ఇచ్చే సమయంలో ఫిర్యాదుదారుడు దరఖాస్తు, ఆధార్ కార్డు జిరాక్స్, సెల్‌ఫోన్ నంబర్ ఇవ్వాల్సి ఉంటుంది. ప్రజల నుంచి స్వీకరించిన వినతుల్లోని సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇస్తున్నారు. సమస్య పరిష్కారానికి తీసుకున్న చర్యలపై సంబంధిత వ్యక్తికి ఫోన్ ద్వారా సమాచారం ఇస్తున్నారు. అయితే ఇటీవల జరిగిన సంఘటనను చూస్తే.. తెలుగుదేశం ప్రభుత్వంలో అధికార యంత్రాగం ఎంత జవాబుదారీ తనంతో పనిచేస్తుందో అర్థమవుతోంది.

ఏం జరిగిందంటే ?

కర్నూలు నగరంలోని ఉల్చాల రోడ్డులో ఉన్న స్కంద గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో కాలనీలలో మురుగు నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసన, దోమలతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ సమస్యపై ఆ కాలనీవాసి అభిషేక్ ఈ నెల 7వ తేదీన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేశారు.పది రోజులైనా సమస్య పరిష్కారం కాలేదు. మరోసారి వెబ్‌సైట్‌ను సంప్రదించాడు. అయితే సమస్యను పరిష్కరించినట్లు అధికారులు బాధితుడికి సమాచారం చేరవేశారు. ఎక్కడి సమస్య అక్కడే ఉంటే.. పూర్తిగా పరిష్కరించినట్లు తప్పుడు సమాచారంఇవ్వడంతో ఖంగుతిన్నాడు. కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేయగా అధికారులు తప్పుడు సమాచారం ఇవ్వడంతో మరింత అసౌకర్యానికి గురయ్యాడు.

మంత్రిని, కలెక్టర్‌ను తప్పు దోవ పట్టించిన అధికార యంత్రాంగం

24 గంటల్లో సమస్యను పరిష్కరిస్తామని చెప్పిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోగా సమస్యను పరిష్కరించినట్లు తప్పుడు సమాచారం ఇవ్వడంపై ఫిర్యాదుదారుడు నేరుగా సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. కాలనీలో నెలకొన్న సమస్యను వివరిస్తూ ఫోటోలు, తాను ఫిర్యాదు చేసిన కాపీ, పరిష్కరించినట్లు అధికారులు పంపిన సమాచారాన్ని ఎక్స్‌లో పోస్టు చేశాడు. దీంతో అధికారులు తప్పుదోవ పట్టించినట్లు తెలుసుకున్న మంత్రి నారా లోకేష్ ఫిర్యాదుదారుడికి ట్విట్టర్ వేదికగా క్షమాపణలు చెప్పారు. త్వరలోనే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమస్యను మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన అధికార యంత్రాంగం కర్నూలు కార్పొరేషన్ అధికారులను అలర్ట్ చేశారు. దీంతో శనివారం నగరపాలక అధికారులు స్కంద లోటస్ గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో మురుగు కాల్వలను పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. వెంచర్ వద్ద 1.70 కిలోమీటర్ల వరకు కచ్చకాలువ నిర్మించి గల్వర్ ద్వారా మురుగు నీటిని తొలగించారు. సమస్యను తాత్కాలికంగా పరిష్కరించారు. సర్వే చేయించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎక్స్‌లో సమాచారం చేరవేశారు. ఎట్టకేలకు సమస్య ఒక కొలిక్కి వచ్చింది. ఈ వ్యవహారంలో జిల్లా అధికార యంత్రాంగం వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సిద్ధరామయ్యపై విచారణ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలి



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

కర్నూలు(సెంట్రల్): కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై గవర్నర్ ఇచ్చిన విచారణ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కర్ణాటకలోని ప్రజా ప్రభుత్వాన్ని కూల్చే ప్రక్రియలో భాగంగానే ముఖ్యమంత్రిపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఆదివారం సాయంత్రం ఆయన కర్నూలులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ఎలాంటి తప్పు చేయలేదన్నారు. ఆయన కుటుంబానికి మైసూరు అర్బన్ ఏరియా డెవలప్‌మెంట్‌లో భూమి ఉందని, దానిని ప్రభుత్వం తీసుకొని వేరేచోట అభివృద్ధి చేసిన ప్లాట్లను కేటాయించిందన్నారు. గవర్నర్ ప్రజా నాయకుడైన ముఖ్యమంత్రిపై ఎలా విచారణకు ఆదేశిస్తారని ప్రశ్నించారు. కేరళ, తమిళనాడులో కూడా గవర్నర్ల పాలన సాగుతోందని, ఏడాది నుంచి పలు బిల్లులకు గవర్నర్లు ఆమోదం తెలపకపోవడంతో నిధులు రాక ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ డాక్టర్ హత్యాచారానికి బాధ్యతగా ముఖ్యమంత్రి మమత బెనర్జీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా నాయకులు కె.జగన్నాథం, ఎస్.మునెప్ప, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పద్ధతి మార్చుకోకుంటే నగర బహిష్కరణ



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ నాగరాజరావు

కర్నూలు: రౌడీ షీటర్లు పద్ధతి మార్చుకోకుంటే నగర బహిష్కరణ చేస్తామని రెండవ పట్టణ సీఐ నాగరాజరావు హెచ్చరించారు. స్టేషన్ పరిధిలో 32 మంది రౌడీ షీటర్లుగా నమోదయ్యారు. అలాగే సస్పెక్ట్ షీటర్లు, సారా విక్రయదారులను ఆదివారం స్టేషన్‌కు పిలిపించి సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. గతంలో చేసిన తప్పులను గుణపాఠంగా భావించి మంచి ఆలోచనలతో సన్మార్గంలో నడవాలని వారికి సూచించారు. సారా తయారీ, విక్రయాలను మానుకొని ప్రత్యామ్నాయ ఉపాధి చూసుకోవాలని తద్వారా సక్రమ మార్గంలో నడవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలను ఎటువంటి పరిస్థితుల్లో సహించేది లేదని హెచ్చరించారు. పోలీసుల సూచనలను పాటిస్తు గౌరవంగా జీవనం సాగిస్తే ఆరు మాసాల పాటు వారి ప్రవర్తనను పరిశీలించి రౌడీ షీట్లను ఎత్తివేస్తామన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కను నాటి నీరు పోస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు

కర్నూలు కల్చరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) నగర సంఘ్ చాలక్ డాక్టర్ చల్లా వాసురెడ్డి అన్నారు. ఆర్ఎస్ఎస్ శత వసంతంలోకి అడుగు పెడుతున్న నేపథ్యంలో ఆదివారం పర్యావరణ రక్షా బంధన్ కార్యక్రమాన్ని కల్లూరులో ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణ - గ్రామ పరివర్తనా కార్యక్రమం చేపట్టి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో సామాజిక పరివర్తన సాధించడానికి పంచ పరివర్తన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. పర్యావరణ రక్షాబంధన్ పేరుతో మొక్కలు నాటి సంరక్షిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 26వ తేదీ వరకు కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. జిల్లా సంఘ చాలక్ ఎన్‌వీఎస్ గుప్త, జిల్లా ప్రచార ప్రముఖ్ అక్కె విశ్వనాథ్, నగర ప్రచార ప్రముఖ్ చంద్రశేఖర్, సా యి,మనోజ్, మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనం



విద్యార్థులకు ఉపకార వేతనం అందిస్తున్న జకాత్ ట్రస్ట్ సభ్యులు

కర్నూలు సిటీ: నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఉర్దూ, గడియారం హాస్పిటల్)లో ఆదివారం జకాత్ ట్రస్ట్ ఫర్ ఎడ్యుకేషన్ వారు 57 మంది అనాథ విద్యార్థినీ, విద్యార్థులకు రూ.1200 చొప్పున ఉపకార వేతనాలను అందజేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు సయ్యద్ మహమ్మద్ పీర్, సభ్యులు ఎస్.ఇస్మాయిల్ బాషా, తహా మహమ్మద్, జమీర్ అహ్మద్ పాల్గొని విద్యార్థులకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు ఉపకార వేతనాలను చదువు కోసం వినియోగించుకోవాలన్నారు. విద్య వ్యక్తిత్వాన్ని పెంచి అభివృద్ధి వైపు నడిపిస్తుందని వివరించారు. ఎన్ని కష్టాలు ఎదురైనా చదువును నిర్లక్ష్యం చేయకూడదని, ఆత్మస్థైర్యంతో చదివితే అద్భుతమైన ఫలితాలు వస్తాయన్నారు. ప్రధానోపాధ్యాయులు ఎస్.పుష్పరాజ్, సహాయకులు సుఖుర్ మాట్లాడుతూ.. అనాథ విద్యార్థులకు ఉపకార వేతనం అందించిన జకాత్ ట్రస్ట్ వారికి విద్యార్థుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కర్నూలు కల్చరల్: కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సుమారు 60 సంవత్సరాలు వయసున్న గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం మృతి చెందినట్లు కర్నూలు రైల్వే పోలీస్ స్టేషన్ ఏఎస్‌ఐ కేమ్‌ఎవీ ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. ఇతను ఈనెల 16వ తేదీ సాయంత్రం 5.30 గంటల సమయంలో కర్నూలు సిటీ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారం 1లో స్పృహ లేకుండా పడిపోయి ఉన్నాడని ఆర్‌పీఎఫ్ పోలీస్‌లు స్టేషన్ మాస్టర్‌కు సమాచారం ఇచ్చారని తెలిపారు. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించినట్లు పేర్కొన్నారు. చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం 12.33 గంటలకు మృతి చెందాడని తెలిపారు. కర్నూలు రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ నజియా ముబీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలిసిన వారు 9014586555 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు



శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): ప్రతిఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని లయన్స్ క్లబ్ సభ్యులు, కంటి వైద్యుడు డాక్టర్ జయప్రకాష్ చెప్పారు. బాలసాయి కంటి వైద్యశాల, సందీప్ క్లినిక్, లయన్స్ క్లబ్ కర్నూలు మెల్విన్ జోన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జంపాల శివయ్య నగర్‌లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జయప్రకాష్ మాట్లాడుతూ.. శరీరంలో అత్యంత ప్రాధాన్యత ఉన్న నేత్రాలను తరచూ పరీక్షలు చేయించుకుంటూ ఉండాలన్నారు. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రంగనాయకులు, డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ.. పేదలకు వైద్య సదుపాయాలు అందించాలన్న ఉద్దేశంతో మురికి వాడల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం స్థానిక ప్రజలకు డయాబెటీస్, బీపీపై అవగాహన కల్పించారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ రాయపాటి శ్రీనివాస్, రాకేష్‌గౌడ్, డివి.చంద్ర, రాజశేఖర్‌గౌడ్, ఎ.రాజు,మౌలాలి,వెంకటేష్, సిద్దయ్య పాల్గొన్నారు.

హిందూ సంఘటన అత్యావశ్యకం



మాట్లాడుతున్న వీహెచ్‌పీ దక్షిణాంధ్ర ఉపాధ్యక్షుడు మాళిగి వ్యాసరాజ్

కర్నూలు కల్చరల్: ప్రస్తుత సమాజంలో హిందూ సంఘటన అత్యావశ్యకమని విశ్వ హిందూ పరిషత్ దక్షిణాంధ్ర ఉపాధ్యక్షులు మాళిగి వ్యాసరాజ్ అన్నారు. వీహెచ్‌పీ షష్ఠ్యబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వీహెచ్‌పీ అభయాంజనేయస్వామి ప్రఖండ కృష్ణా నగర్‌లోని శ్రీనివాస మందిరంలో హిందూ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు హిందువులను పూర్తి నిర్లక్ష్యం చేయడంతో మెజారిటీ ప్రజలైన హిందువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీన్ని నివారించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి, జిల్లా సేవా ప్రముఖ్ తుంగా రమేష్, జిల్లా కార్యదర్శి మాళిగి భానుప్రకాష్, బజరంగ్ దళ్ సంయోజక్ సాయిరాం, జిల్లా మాతృశక్తి కన్వీనర్ పావని, దుర్గా వాహిని కన్వీనర్ లక్ష్మి, కో-కన్వీనర్ రాజేశ్వరి, ప్రఖండ కార్యదర్శి సంపాల నవీన్, తదితరులు పాల్గొన్నారు.


రజక విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కర్నూలు(అర్బన్): చదువుతో జ్ఞానం, సంస్కారం అలవడతాయని రజక విద్యా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సీపీ వెంకటేష్ అన్నారు. ఆదివారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో సమితి ఆధ్వర్యంలో రజక విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, నగదు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ రజక విద్యార్థుల్లో విద్య పట్ల మరింత ఆసక్తిని పెంచేందుకు ప్రతి ఏడాది పురస్కారాలను అందిస్తున్నామన్నారు. ఈ ఏడాది టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఇతర విద్యల్లో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2 వేల ప్రకారం 40 మందికి నగదు బహుమతులతో పాటు అవార్డులను అందించినట్లు తెలిపారు. నాయకులు జిల్లెల్ల శ్రీరాములు, జిల్లా రజక సాధికార కమిటీ అధ్యక్షులు మాలంగిరి గణేష్, రాయలసీమ కన్వీనర్ సీహెచ్ లింగమయ్య, మహిళా విభాగం అధ్యక్షురాలు రేణుకమ్మ, నగర అధ్యక్షురాలు రాధమ్మ, బీసీ మహిళా విభాగం అధ్యక్షురాలు భారతి, గోరంట్ల గిడ్డయ్య, న్యాయవాదులు జగదీష్‌బాబు, పీ వెంకటేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు హనుమాన్ చాలీసా పారాయణం

కర్నూలు కల్చరల్: శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్య స్వామి తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 108 పర్యాయాలు హనుమాన్ చాలీసా పారాయణం, మామిళ్లపల్లి రాజేష్ శర్మ ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం శ్రీ రాజశ్యామలా అమ్మవారి హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ప్రారంభం



కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో ఆదివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ప్రారంభమయ్యాయి. జగన్నాథ్, బలదేవ్, సుభద్రా మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భగవద్గీత తరగతులు జరిగాయి. శీల ప్రభుపాదుల ప్రేమ విందు జరిగింది. శ్రీ రాధా గోవింద ఝులన్ యాత్ర మహోత్సవంలో భాగంగా ఊయల సేవ నిర్వహించారు. ఇస్కాన్ బాధ్యులు రఘునంద సేవక ప్రభు సందేశమిచ్చారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలు ఎంతో మేలు



గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి సభ్యులు

కర్నూలు కల్చరల్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి నగర అధ్యక్షులు డాక్టర్ మోక్షేశ్వరుడు సూచించారు. ఆదివారం వినాయక ఘాట్ వరసిద్ధి వినాయక స్వామి దేవాలయం సమావేశ మందిరంలో వినాయక మండపాల నిర్వాహకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 7 నుంచి వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభ మవుతాయన్నారు. కర్నూలులో ఈ ఏడాది 44వ ఉత్సవాలను నిర్వహించుకుంటున్నామన్నారు. మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. ఉత్సవ సమితి నగర ప్రధాన కార్యదర్శి జంపాల జనార్దన్ మాట్లాడుతూ సంప్రదాయ పద్ధతిలో ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు టీసీ మద్దిలేటి, ఉత్సవ సమితి కోశాధికారి సుబ్రహ్మణ్యం, జిల్లా సహ ప్రధాన కార్యదర్శి రంగస్వామి, సభ్యులు హనుమంతరాయ చౌదరి, దామోదర్‌రెడ్డి, చంద్రశేఖర శర్మ, తదితరులు పాల్గొన్నారు.

7 తులాల బంగారం చోరీ

కర్నూలు కల్చరల్: నగరంలోని రిచ్‌మండ్ విల్లాస్‌లో చోరీ జరిగింది. అక్కడ నివాసం ఉండే ఉపాధ్యాయుడు శ్రీరాములు తన కుమారుడిని ఇంజినీరింగ్‌లో చేర్పించేందుకు ఈనెల 15వ తేదీ జార్ఖండ్‌కు వెళ్లారు. పని పూర్తి చేసుకొని తిరిగి వచ్చే సరికి ఇంట్లో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. ఇంట్లో ఉన్న ఏడు తులాల బంగారాన్ని దొంగలు చోరీ చేసినట్లు తెలుసుకున్న శ్రీరాములు నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రాఖీ కొనుగోళ్లు



అన్నచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ నేపథ్యంలో ఆదివారం మహిళలు రాఖీలను కొనుగోలు చేసేందుకు రాగా పాతబస్తీలోని దుకాణాలు కిటకిటలాడాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

బలిజ సంఘం నూతన కార్యవర్గం

కర్నూలు(అర్బన్): నగరంలోని బలిజ సంఘం కార్యాలయంలో ఆదివారం 38 మంది నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారని రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు ఆర్జా రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత కార్యవర్గంలో యువతతో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రానున్న మూడేళ్లలో నగరంలోని బలిజ సంఘీయులకు విద్య, ఉపాధి, ఉద్యోగావకాశాలకు సంఘం కృషి చేయాలన్నారు. అలాగే అర్హులైన వారికి నామినేటెడ్ పదవులు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ పర్యాయం మహిళలు కార్యవర్గంలో భాగస్వామ్యులు కావడం అభినందనీయమని పేర్కొన్నారు. సంఘం మాజీ అధ్యక్షుడు పత్తి ఓబులయ్య నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడు గోపినాథ్, కార్యదర్శి ఎం.రవి, కోశాధికారి శైలజతో పాటు అల్లం రఘు, అమర్, డాక్టర్‌రంగనాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పోస్టింగ్‌కు పైరవీలు

కర్నూలు (టౌన్): ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన ఓ ఉద్యోగిని విధుల నుంచి తొలగిస్తూ అప్పటి మున్సిపల్ కమిషనర్, ఐఏఎస్ అధికారి భార్గవ్‌తేజ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే కమిషనర్ ఇటీవల బదిలీ అయ్యారు. అంతే.. ఉద్వాసనకు గురైన వ్యక్తిని తిరిగి విధుల్లోకి తీసుకునే ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయి. ఇంజినీరింగ్ విభాగంలోని ఓ ఇంజినీర్ ఇందుకు పైరవీలు చేస్తున్నారు. అధికారులకు మామూళ్లు కట్టబెట్టి ఉద్యోగం ఇప్పించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం నిబంధనలు పక్కన పెట్టి హడావుడిగా ప్రక్రియ పూర్తిచేసేలా అధికార యంత్రాంగం ఆసక్తి ప్రదర్శిస్తోంది. దీనికంతటికీ ముడుపులే కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఉద్యోగం నుంచి తొలగించినా తిరిగి చేర్చుకునే ప్రయత్నాలు..

ఆప్కాస్ (ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఔట్‌సోర్సింగ్ సర్వీస్) కింద నగరపాలక ఇంజినీరింగ్ విభాగంలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా ఓ ఉద్యోగి విధులు నిర్వహిస్తున్నాడు. కాగా ఈ ఏడాది మార్చి 16న సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. ఉద్యోగులు ఏ రాజకీయ పార్టీకి సపోర్టు చేయడం, ప్రచారంలో పాల్గొనడం వంటివి చేయరాదని ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే సదరు వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడు. దీనిపై అప్పటి ఐఏఎస్ అధికారి, కమిషనర్ భార్గవ్‌తేజ పూర్తిస్థాయిలో విచారణ చేసి నివేదిక ఆధారంగా ఉద్యోగం నుంచి తొలగించారు. ఈ ఘటన నాలుగు నెలల క్రితం జరిగింది. ప్రభుత్వం మారింది. ఇప్పుడు అదే ఉద్యోగిని విధుల్లో చేర్చుకునే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇదే విభాగంలో పనిచేసే ఓ ఇంజినీర్ పైరవీలు చేస్తున్నారు. తొలగించిన వ్యక్తిని తిరిగి ఉద్యోగంలో చేర్చుకునేందుకు ఉన్నతస్థాయి అధికారులతో మాట్లాడి సెట్ చేసుకున్నారు. మామూళ్లు కూడా మాట్లాడుకున్నారు. టీడీపీ నుంచి ఒత్తిళ్లు ఉన్నాయంటూ ఏలాగైనా సదరు వ్యక్తిని ఉద్యోగంలోకి తీసుకునేందుకు లాబీయింగ్ చేస్తున్నారు.

నిబంధనలు పక్కన పెట్టి.. పాలకవర్గాన్ని విస్మరించి

విధుల నుంచి తొలగించిన వ్యక్తిని నిబంధనల ప్రకారం తిరిగి ఉద్యోగంలోకి తీసుకోకూడదు. జీఓలో ఈ నిబంధనలు ఉన్నాయి. అయినా ప్రతిఫలం దక్కడంతో ఉద్యోగంలో చేర్చుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆప్కాస్ నుంచి ఉద్యోగంలోకి తీసుకోవాలంటే ముందుగా ఇంజినీరింగ్ విభాగంలో అవసరం ఉండాలి. ఆ తరువాత కమిషనర్ అనుమతి ఉండాలి. స్టాండింగ్ కమిటీ దృష్టికి తీసుకెళ్లాలి. అక్కడ క్లియర్ అయిన తరువాత జనరల్ బాడీ సమావేశంలో చర్చించి ఆ తరువాత నియమాక ప్రక్రియ చేపట్టాల్సి ఉంది. వీటన్నింటినీ పక్కన పెట్టి సదరు ఉద్యోగిని చేర్చుకునే ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి.